40 మంది సచివాలయ ఉద్యోగులకు మెమోలు

ప్రజాశక్తి - నరసాపురం

పట్టణంలోని 40 మంది సచివాలయ ఉద్యోగులకు మెమోలు జారీ చేసినట్లు కమిషనర్ ఎం.అంజయ్య తెలిపారు. ఈ నెల 27న పట్టణంలోని వలందర్‌రేవులో నిర్వహించిన యోగాంధ్ర సామూహిక అభ్యసన కార్యక్రమానికి గైర్హాజరైన సిబ్బందికి మెమోలు జారీ చేయాలని జెసి ఆదేశించారని, ఆ మేరకు మెమోలు జారీ చేశామని కమిషనర్ చెప్పారు.

అమ్మో.. జూన్..!

తల్లిదండ్రుల్లో ఫీజుల టెన్షన్

భారీగా బాదేస్తున్న విద్యాసంస్థల యాజమాన్యాలు

గతేడాది కంటే 25 నుంచి 50 శాతం వరకూ పెరిగిన బాదుడు



ప్రజాశక్తి - కాళ్ల

మరో మూడు రోజుల్లో జూన్ మాసం ప్రారంభం కానుంది. విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఆందోళన మొదలైంది. మధ్యతరగతి ఉద్యోగుల నుంచి రైతులు, సగటు జీవులు తమ పిల్లలను చదివించుకునేందుకు లెక్కల్లో మునిగి తేలుతున్నారు. రైతుల పరిస్థితి మరీ ఇబ్బందికరంగా ఉంది. ఇటు చదువులు, అటు వ్యవసాయ పెట్టుబడులకు ఒకేసారి సొమ్ము సిద్ధం చేసుకోవాల్సి రావడంతో తలలు పట్టుకుంటున్నారు. దీంతో జూన్ మాసం అంటేనే సామాన్య, మధ్యతరగతి ప్రజలు హడలిపోయే పరిస్థితులు నెలకొన్నాయి.

పశ్చిమగోదావరి జిల్లాలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు, ఎయిడెడ్, మున్సిపల్ పాఠశాలలు 1375 ఉన్నాయి. ప్రయివేట్ పాఠశాలలు 520 వరకూ ఉన్నాయి. జిల్లాలో లక్షా 41 వేల మంది విద్యార్థులు ఉన్నారు. ప్రయివేటు విద్యాసంస్థల్లో అత్యధికం ప్రభుత్వ నిబంధనలను బేఖాతరు చేస్తూ ఫీ'జులుం' ప్రదర్శిస్తున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

తల్లిదండ్రుల్లో పిల్లల చదువు పట్ల గతంకంటే ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వడం పెరిగింది. దీనికి ఆర్థికంగా భారమైనా సిద్ధపడుతుండటం గమనార్హం. అవసరమైతే అప్పులు చేసేందుకూ వెనుకాడటం లేదు. అందుకే జూన్ వస్తోందంటే వారిలో టెన్షన్ మొదలైపోతుంది. సాధారణంగా ఒకటో తేదీ అంటే ప్రతి నెలా ప్రత్యేకమే. జూన్ నెల అంటే ఇంకాస్త ప్రత్యేకమని చెప్పొచ్చు. పిల్లల ఫీజులు, పుస్తకాలు, యూనిఫారం తదితర వాటి కోసం కనీసంగా రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకూ చేతిలో ఉంచుకోవాలి.

పెరిగిన పుస్తకాల ధరలు

గతేడాది రూ.60 ఉన్న నోటు పుస్తకం ధర ఈ ఏడాది రూ.75 పైమాటే. గతేడాది ఆరో తరగతి విద్యార్థులకు నోటు పుస్తకాలకు రూ.వెయ్యి వరకూ ఖర్చయితే ఈ సంవత్సరం కనీసంగా రూ.1500 వరకూ వెచ్చించాల్సిన పరిస్థితి. ఇది ఒక్క నోటు పుస్తకాలకే కాదు. ఇంకా పెన్నులు, పెన్సిళ్లు, ఇతరత్రా వస్తువుల కొనుగోలు వ్యయం అదనం. గతేడాది వరకూ స్కూల్ బ్యాగ్ రూ.300కే దొరికేది. ఈ ఏడాది రూ.500 లేనిదే బ్యాగ్ దొరకని పరిస్థితి ఉంది. ఇక బూట్లు, లంచ్ బాక్స్ తదితరాల గురించి చెప్పనక్కర్లేదు. విద్యార్థుల రవాణాకు సంబంధించిన ఛార్జీలు సైతం యాజమాన్యాలు పెంచడం గమనార్హం. ఈ కాలంలో ప్రత్యేకంగా పెట్రోలు, డీజిల్ ధరలు పెరగకపోయినా నిర్వహణా వ్యయం పెరిగిందని చెప్పడం గమనార్హం. గతేడాది వరకూ ఐదు కిలోమీటర్ల దూరానికి నెలకు రూ.700 తీసుకునేవారు. ఈ ఏడాది రూ.1000 వరకూ డిమాండ్ చేస్తున్నారు. గతేడాది ఓ మోస్తరు ప్రయివేటు పాఠశాలలో ఆరో తరగతి విద్యార్థి ఫీజు రూ.20 వేలకుపైగా ఉండేది. ఈ ఏడాది దానిని రూ.30 వేలకు పైగా పెంచడం గమనార్హం. చిన్నపాటి ప్రయివేటు పాఠశాలల్లో ప్రాథమిక తరగతులకు రూ.15 వేలలోపే ఫీజు ఉండేది. అయితే ఈ సంవత్సరం అది రూ.20 వేలకు చేరింది. ఇప్పటికే కార్పొరేట్ విద్యా సంస్థలు అడ్మిషన్ల కోసం పిఆర్‌ఒలను రంగంలోకి దించాయి. మరికొన్ని యాజమాన్యాలు నేరుగా విద్యార్థుల తల్లిదండ్రులకే ఫోన్లు చేస్తున్నాయి. ముందస్తుగా ఫీజు చెల్లించి అడ్మిషన్ ఖాయం చేసుకోవాలని ఒత్తిడి చేస్తుండటం విశేషం. ఆలస్యం చేస్తే సీట్లు దొరకవని చెబుతుండటం విశేషం.

ప్రభుత్వం నిర్దేశించిన ఫీజుల వివరాలు ఇలా

ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఒకటి నుంచి మూడో తరగతి వరకూ గ్రామీణ ప్రాంతాల్లో రూ.6 వేలు, మండల కేంద్రాల్లో రూ.7,500, పట్టణాల్లో రూ.8,500గా నిర్ధారించారు. 4, 5 తరగతులకు గ్రామీణ ప్రాంతాల్లో ఏడాదికి రూ.9 వేలు, పట్టణాల్లో రూ.10,500, జిల్లా కేంద్రంలో రూ.12 వేలు, ఆరో తరగతికి గ్రామీణ ప్రాంతాల్లో రూ.9 వేలు, మండల కేంద్రాల్లో రూ.9,500, జిల్లా కేంద్రాల్లో రూ.11,100గా ఫీజు నిర్ధారించారు. అయితే ఇంతకు మించి యాజమాన్యాలు వివిధ పేర్లతో వసూలు చేస్తున్నాయి.

అదనపు భారం.. ★★★

నేరేడుబిల్లి దుర్గారావు, విద్యార్థి తండ్రి, జువ్వలపాలెం

గతేడాది మా అబ్బాయి ఆరో తరగతి ఫీజు రూ.12 వేలు కట్టాం. ఇప్పుడు ఏడో తరగతికి రూ.20 వేలు చెల్లించాలని యాజమాన్యం చెబుతోంది. ఒక్క ఏడాదికే రూ.ఎనిమిది వేల భారం పెంచింది. ఇది దారుణం. పిల్లల చదువులకు అప్పులు చేయాల్సి వస్తోంది. ప్రభుత్వం నియంత్రణ చర్యలు చేపట్టాలి.

తట్టుకోలేకపోతున్నాం.. ★★★

కొల్లి శ్రీనివాస్, విద్యార్థి తండ్రి, దొడ్డనపూడి

పిల్లల చదువుల భారం ఆర్థికంగా చాలా ఇబ్బందిగా ఉంటోంది. ఏడాదికేడాది ఫీజులు పెంచేస్తున్నారు. కనీసం ఫీజుల నియంత్రణపై ప్రభుత్వం దృష్టి సారించకపోవడం విచారకరం. ఇప్పటికైనా ప్రభుత్వం చొరవ తీసుకోవాలి.

నిబంధనలు పాటించాలి.. ★★★

నారాయణ, డిఇఒ, పశ్చిమగోదావరి జిల్లా

విద్యాసంస్థలు నిబంధనలు పక్కాగా పాటించాలి. ఇప్పటికే అన్ని యాజమాన్యాల విద్యాసంస్థలకు స్పష్టమైన ఆదేశాలిచ్చాం. ఎక్కడైనా ఫీజుల కోసం బలవంతం పెడితే ఫిర్యాదు చేయాలి. కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వం నిర్దేశించిన ఫీజులనే వసూలు చేయాలి.

ఎన్‌టిఆర్ జీవితం స్ఫూర్తిదాయకం

కలెక్టర్ చదలవాడ నాగరాణి

ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

తెలుగువారి ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన మహాపురుషుడు ఎన్‌టిఆర్ జీవితం అందరికీ స్ఫూర్తిదాయకమని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. బుధవారం జిల్లా కలెక్టరేట్‌లో ఎన్‌టిఆర్ 102వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొలుత ఎన్‌టిఆర్ చిత్రపటానికి కలెక్టర్ నాగరాణి, జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్‌టిఆర్ అసాధారణ జీవితం, దూరదృష్టితో కూడిన నాయకత్వంతో రాష్ట్రంపై తిరుగులేని ముద్రవేశారన్నారు. సిఎంగా నిరుపేదలకు మంచి లబ్ధిని చేకూర్చారన్నారు. జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఎన్‌టిఆర్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. తెలుగు ప్రజల హృదయాల్లో ఎన్‌టిఆర్ చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. అనంతరం కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఎన్‌టిఆర్ ఫొటో ఎగ్జిబిషన్‌ను ఆసక్తిగా తిలకించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డిఆర్‌ఒ ఎం.వెంకటేశ్వర్లు, ఆర్‌డిఒ కె.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఉద్యోగులు, మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ మెరగాని నారాయణమ్మ, టిడిపి నాయకులు మరపట్ల శ్యాంబాబు, ఎమ్‌డి.షబీనా, మాదాసి కనకదుర్గ, మద్దుల రాము, దొంగ వెంకటేశ్వరరావు, విద్యార్థులు, ఎన్‌టిఆర్ అభిమానులు పాల్గొన్నారు.

గల్లంతైన విద్యార్థుల మృతదేహాలు లభ్యం

మృతదేహాలను తీసుకొస్తున్న ఎన్‌డిఆర్‌ఎఫ్ సిబ్బంది

ప్రజాశక్తి - ఆచంట

మంగళవారం సాయంత్రం నుంచి వారంతా గట్టుపైనే బోరున రోదిస్తూ ఉన్నారు. గల్లంతైన తమ బిడ్డలు ప్రాణాలతో తిరిగి రాకపోతారా అనే చిరు ఆశతో గోదావరి వైపు చూస్తున్నారు. బుధవారం తెల్లవారింది. పోలీసులు గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. కొద్దిసేపటికే ఒకొక్కరి మృతదేహాలను ఒడ్డుకు చేర్చుతుంటే కుటుంబీకుల ఆర్తనాదాలతో గోదావరి గట్టు ప్రాంతం మార్మోగింది. ఇదీ ఆచంట మండలం రావిలంక వద్ద వశిష్ట గోదావరి ఒడ్డున బుధవారం నాటి పరిస్థితి.

అంబేద్కర్ కోనసీమ జిల్లా నాగుల్లంకకు చెందిన కేతా ప్రవీణ్ (15), సానబోయిన సూర్యతేజ (12), పశ్చిమగోదావరి జిల్లా యలమంచిలి మండలం పెదలంకకు చెందిన నీతిపూడి పౌలుకుమార్ (12) మంగళవారం సాయంత్రం ఆచంట మండలం రావిలంక వద్ద గోదావరిలో స్నానానికి దిగి ప్రమాదవశాత్తూ గల్లంతైన సంగతి తెలిసిందే. వెంటనే ఎస్‌డిఆర్‌ఎఫ్ సిబ్బంది, ఫైర్ సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టినా మంగళవారం రాత్రి వరకూ ఆచూకీ లభించలేదు. బుధవారం ఉదయం మళ్లీ గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు ప్రారంభించగా వారు నీట మునిగిన ప్రాంతంలోనే ప్రవీణ్, సూర్యతేజ, పౌల్‌కుమార్ మృతదేహాలు లభ్యమయ్యాయి. మృతదేహాల వెలికితీతతో అక్కడే ఉన్న కుటుంబీకుల రోదనలతో ఆ ప్రాంతం మార్మోగింది. పంచనామా అనంతరం మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం రాజోలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆచంట ఎస్ఐ వెంకటరమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేతనాలివ్వకపోతే ఎలా బతుకుతారు

ఉపాధి కూలీల బకాయిలపై కౌలురైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు కేతా గోపాలన్

కొడమంచిలిలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న కౌలు రైతులు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కేతా గోపాలన్

ప్రజాశక్తి - ఆచంట

ఏరోజు కూలి డబ్బులతో ఆ పూట పొట్ట నింపుకునే కూలీలకు రోజులు తరబడి ఉపాధి కూలీ బకాయిలు ఇవ్వకపోతే ఎలా బతుకుతారని కౌలు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కేతా గోపాలన్ అన్నారు. బుధవారం కొడమంచిలి పంచాయతీ పరిధి తురకవానిమెరక గ్రామంలో పని చేస్తున్న ఉపాధి కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తాము చేసిన పనికి వారాల తరబడి వేతనాలు చెల్లించడం లేదని ఉపాధి కూలీలు ఈ సందర్భంగా వాపోయారు. గోపాలన్ మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీలకు 200 రోజులు పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.600 చెల్లించాలన్నారు. జులై 9న జరిగే దేశవ్యాప్త సమ్మెలో ఉపాధి హామీ కూలీలు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం ఉపాధి హామీ కూలీలకు జామ కాయలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి పి.మోహన్‌రావు, నాయకులు బండి రంగారావు, మచ్చ సుబ్బారావు, ఇంజేటి వీరయ్య, కారుపల్లి రాజు, కారుపల్లి పరంజ్యోతి, ఇంజేటి నరసింహమూర్తి, నాగరాజు, సూర్యకాంతం, బాల సావిత్రి, వెంకటలక్ష్మి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం: ఉపాధి కూలీల వేతన బకాయిలు తక్షణమే విడుదల చేయాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కండెల్లి సోమరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధి పర్యటనలో భాగంగా బుధవారం నవాబుపాలెంలోని ఉపాధి పని ప్రదేశాన్ని ఆయన సందర్శించి కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కూలీలు మాట్లాడుతూ ఎనిమిది వారాలుగా పెండింగ్ బకాయిలు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సోమరాజు మాట్లాడుతూ సొమ్ము రాక ఉపాధి కూలీలు ప్రత్యామ్నాయ పనుల కోసం ప్రయత్నిస్తున్నారని తెలిఆపరు. కూలీలు తమంతట తాముగా ఉపాధి పనులు మానేసేలా ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో బైపో ప్రసాద్, ఉండ్రాజవరపు రమేష్, కండెల్లి విజయ, కోనపో సుబ్బారావు, ఉండ్రాజవరపు మేరీ, గడ్డం నాగమణి, కొడమంచిలి దుర్గాప్రసాద్, కునపో వీర్రాజు కండెల్లి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

భీమవరం టౌన్: ఉపాధి హామీ కూలీల బకాయిలు చెల్లించాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు ఇంజేటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు బుధవారం పెదగరువులో సిఐటియు నేతలు ఉపాధి పని ప్రాంతానికి వెళ్లి కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పట్టెం చిన్న యోహాను, పాలపర్తి చంద్రపౌలు, వజ్రమ్మ, మేడిది సత్యానందం, పాలపర్తి జ్ఞానరత్నం, అడిగిన ప్రభుదాసు, కుమారి, జయమణి తదితరులు పాల్గొన్నారు.

భీమవరం టౌన్ : నిరసన వ్యక్తం చేస్తున్న సిఐటియు నాయకులు, ఉపాధి కూలీలు

ఆస్తి పన్ను పెంపు ఉపసంహరించుకోవాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్

ప్రజాశక్తి - భీమవరం

రాష్ట్ర ప్రభుత్వం పెంచిన ఆస్తి పన్నును వెంటనే ఉపసంహరించుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ డిమాండ్ చేశారు. స్థానిక మెంటేవారితోటలోని సుందరయ్య భవనంలో సిపిఎం పట్టణ కమిటీ సమావేశం ఎం.వైకుంఠరావు అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం ఎన్నికల ముందు తాము అధికారంలోకొస్తే ప్రజలపై ఎటువంటి భారాలు వేయబోమని, ప్రజలకు సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని హామీ ఇచ్చిందన్నారు. ప్రస్తుతం ప్రజలపై ఆస్తి విలువ ఆధారంగా ఆస్తి పన్ను 20 శాతం పెంచి ప్రజలపై మోయలేని భారాలు వేస్తుందని విమర్శించారు. ఇప్పటికే ధరలతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతుంటే మళ్లీ రాష్ట్ర ఖజానా నింపుకోవడం కోసం ప్రజలపై ఆస్తి పన్ను పెంచడం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పెంచిన ఆస్తి పన్నును వెంటనే ఉపసంహరించుకోవాలని, లేకుంటే రానున్న కాలంలో ప్రజలను సమీకరించి పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి బి.వాసుదేవరావు, నాయకులు చెల్లబోయిన వెంకటేశ్వరరావు, సత్యనారాయణ, డి.నాగు, కె.కృష్ణ, డి.త్రిమూర్తులు, డి.వరలక్ష్మి పాల్గొన్నారు.

స్థోమత లేనివారికి న్యాయవాదిని ఏర్పాటు చేస్తాం

ఉమ్మడి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.రత్నప్రసాద్

తణుకు : ముద్దాయిలతో మాట్లాడుతున్న రత్నప్రసాద్

ప్రజాశక్తి - తణుకు

స్థోమత లేక న్యాయవాదిని పెట్టుకోలేని వారికి ఉచితంగా న్యాయవాదిని ఏర్పాటు చేస్తామని ఉమ్మడి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.రత్నప్రసాద్ అన్నారు. బుధవారం న్యాయమూర్తి రత్నప్రసాద్ స్థానిక సబ్‌జైల్‌ను సందర్శించారు. అనంతరం రిమాండ్‌లో ఉన్న ముద్దాయిలకు సంబంధించిన కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రత్నప్రసాద్ మాట్లాడుతూ ప్రవర్తనలో మార్పు తెచ్చుకుని మంచిగా జీవించాలని ముద్దాయిలకు సూచించారు. ఆహారం, వసతి, వైద్య సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. భవానీ నర్సింగ్ హోమ్, ప్రియాంక నర్సింగ్ హోమ్‌లను న్యాయమూర్తి రత్నప్రసాద్ సందర్శించి రోగులకు అందుతున్న వైద్య వివరాలు డాక్టర్ రిమ్మలపూడి సూర్యరాజు, కూడారి ఆనంద్‌ను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు టి.సత్యనారాయణరాజు, జెఆర్‌వివిఎస్.పవన్‌కుమార్, జైలు సూపరింటెండెంట్ ఎ.అజయ్‌కుమార్, జి.మోహనరావు, సిబ్బంది పాల్గొన్నారు.

నరసాపురం: ఉమ్మడి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ బుధవారం నరసాపురం సబ్ జైలును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రత్నప్రసాద్ మాట్లాడుతూ క్రమం తప్పకుండా వాయిదాలకు కోర్టులో హాజరు పరుస్తున్నారా, లేదా, అనారోగ్యంగా ఉన్నవారికి వైద్య సదుపాయం కల్పిస్తున్నారా, లేదా అని ఆరా తీశారు. నెలకోసారి సైక్రియాట్రిస్ట్‌తో ముద్దాయిలకు కౌన్సెలింగ్ ఇప్పించాలని జైలు అధికారికి సూచించారు. ప్రిజన్ లీగల్ ఎయిడ్ క్లినిక్ పనితీరు, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ విధివిధానాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. నిందితుల కేసు వివరాలు, ఆహార పదార్థాలు, తాగునీటి సౌకర్యాలు పరిశీలించారు. ఆర్థిక స్థోమత లేనివారు అప్పీల్ చేసుకోవడానికి ఉచిత న్యాయ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సబ్‌జైలు సూపరింటెండెంట్ టి.అప్పారావు, జైలు సిబ్బంది, ప్యానల్ న్యాయవాదులు వెంకటేశ్వరరావు, చిట్టి పద్మజ, పిఎల్‌వి ప్రతిభ రాజీ పాల్గొన్నారు.

రేషన్ సక్రమంగా పంపిణీ చేయాలి

జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి

పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి - పాలకోడేరు

రేషన్ వ్యవస్థలో ప్రభుత్వం చేసిన మార్పుల దృష్ట్యా కార్డుదారులకు ఎలాంటి అసంతృప్తి కలగకుండా రేషన్ సరుకులు పంపిణీ చేయాలని జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి రేషన్ డీలర్లను ఆదేశించారు. బుధవారం శృంగవృక్షంలో 11వ నెంబర్ రేషన్ షాపును ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రేషన్ షాపునకు సంబంధించి తెల్ల రేషన్ కార్డులు ఎన్ని, అంత్యోదయ కార్డులు ఎన్ని అని డీలర్ సోము సాయి రామకృష్ణను అడిగి తెలుసుకున్నారు. 65 ఏళ్ల వృద్ధులకు, వికలాంగులకు ఎలాంటి ఇబ్బందీ కలగకుండా ఇంటికే సరఫరా చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి సరోజిని, సహాయ పౌర సరఫరాల అధికారి రవిశంకర్, మండల డిప్యూటీ తహశీల్దార్ ఆదిశేషయ్య పాల్గొన్నారు.

చదరంగంతో మెదడుకు పదును

చదరంగం పోటీలను ప్రారంభిస్తున్నబొమ్మిడి సునీత

ప్రజాశక్తి - నరసాపురం

చదరంగం మనిషి మెదడుకు పదును పెట్టే క్రీడ అని ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ సతీమణి సునీత అన్నారు. బుధవారం నరసాపురం హైవే ఇన్ ఫంక్షన్ హాలులో మాస్టర్ చెస్ అకాడమీ, అభయ చారిటబుల్ ట్రస్ట్, వాసవి క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు నూలి సాయి అభయ్ ఎపి స్టేట్ అండర్-19 ఓపెన్, గర్ల్స్ స్టేట్ ఛాంపియన్ షిప్‌పోటీలను సునీత నాయకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకత, మేధోశక్తిని వెలికితీసేందుకు చదరంగం బాగా తోడ్పడుతుందన్నారు. ఈ పోటీలను అభయ ట్రస్ట్ ఛైర్మన్ నూలి శ్రీనివాస్ ఆధ్వర్యంలో మాస్టర్ చెస్ అకాడమీ వారి సహకారంతో గత ఎనిమిదేళ్లగా నిర్వహించడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో కూడా ఇటువంటి పోటీలను మరిన్ని నిర్వహించాలని శ్రీనివాస్‌కు సూచించారు. మున్సిపల్ వైస్ ఛైర్మన్లు కొత్తపల్లి నాని, కామన నాగిని మాట్లాడుతూ చదరంగ పోటీల విశిష్టతను తెలిపారు. అభయ ట్రస్ట్, వాసవి క్లబ్ అధ్యక్షులు నూలి శ్రీనివాస్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదంలో చనిపోయిన తన కుమారుడు సాయి అభయ్ జ్ఞాపకార్థం వివిధ సేవా కార్యక్రమాలతో పాటు ప్రతియేటా చదరంగ పోటీలను దిగ్విజయంగా నిర్వహిస్తున్నామన్నారు. సుమన్ మాట్లాడుతూ గత ఏడు సంవత్సరాలను నుంచి ఫ్రీ ఎంట్రీతో నిర్వహించడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో మాస్టర్ అకాడమీ కార్యదర్శి ఎస్ఎస్.చంద్రశేఖర్, చీఫ్ ఆర్బిటర్ గోపీనాథ్, నూలి భవాని, వాసవి ఏర్పాట్లను పర్యవేక్షించారు. కౌన్సిలర్లు కొప్పాడ కృష్ణకుమారి, తోట అరుణ, వలవల నాని, పోలిశెట్టి సాంబ, పిప్పళ్ల సత్య, వాసవీ క్లబ్ సభ్యులు బదరీ, బాలకష్ణ, బాబ్జీ, చిట్టి రాంబాబు, రాజా, రామారావు పాల్గొన్నారు.

మద్యం అమ్మకాలు పారదర్శకంగా సాగాలి

జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో మద్యం అమ్మకాలు పారదర్శకంగా సాగాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి అన్నారు. మద్యం కొనుగోలు అమ్మకాల లావాదేవీలు ఆన్‌లైన్ ద్వారా నిర్వహించాలన్నారు. బుధవారం కలెక్టరేట్లో ఎక్సైజ్ అధికారులు, లిక్కర్ షాప్ యజమానులతో మద్యం సరఫరా, అమ్మకాలు తదితర అంశాలపై ఆయన సమీక్షించారు. లిక్కర్ అమ్మకాలు ఏ విధంగా ఉన్నాయి, ఇండెంట్ ప్రకారం సకాలంలో షాపులకు సరుకు అందుతుందా, ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అరా తీశారు. జెసి మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, మద్యం దుకాణాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, అమ్మకాలు పారదర్శకంగా ఉండాలని అన్నారు. ప్రతి బాటిల్ స్కాన్ చేసి అమ్మే విధంగా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ సూచించారు. ప్రతిరోజూ షాపులో ఉన్న సరుకు, జరిగిన అమ్మకాలు, స్టాక్ నిల్వ తదితర వివరాలు ఆన్‌లైన్‌లో పొందుపరచాలని సూచించారు. ఈ సమావేశంలో ఎక్సైజ్ అధికారి డాక్టర్ ఆర్ఎస్.కుమరేశ్వరన్, డిపో మేనేజర్ ఎల్.రంగారెడ్డి, వివిధ మండలాలకు చెందిన షాప్ యజమానులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జెసి రాహుల్‌కుమార్ రెడ్డి

సినిమా థియేటర్లలో తనిఖీలు

థియేటర్లతో పరిశీలిస్తున్న తహశీల్దార్

ప్రజాశక్తి - నరసాపురం

జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పట్టణంలోని అన్నపూర్ణ, రాజరాజేశ్వరి థియేటర్లలో బుధవారం రెవెన్యూ అధికారులు తనిఖీలు చేశారు. మరుగుదొడ్లు, పారిశుధ్యం, క్యాంటీన్లో తినుబండరాలు ధరలు, టిక్కెట్ ధరలు, లైసెన్స్ రెన్యూవల్ తదితర విషయాలను క్షుణ్ణంగా పరిశీలించారు. థియేటర్ యాజమానుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామని తహశీల్దార్ ఐవి.సత్యనారాయణ చెప్పారు. థియేటర్ వద్ద టిక్కెట్ ధరల పట్టికను ఏర్పాటు చేయాలని యజమానులుకు సూచించారు. ఈ తనిఖీల్లో ఆర్ఐ మిరియాల లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

మొగల్తూరు : రెవెన్యూ శాఖ అధికారులు మొగల్తూరులోని చెరుకూరి థియేటర్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. దీనిలో భాగంగా థియేటర్ యాజమాన్యాలు ప్రేక్షకులు కల్పిస్తున్న వసతులను తహశీల్దార్ కె.రాజు కిషోర్ సిబ్బందితో పరిశీలించారు. వీటిలో ప్రధానంగా ఫైర్ సేఫ్టీ, టాయిలెట్స్, సిటింగ్ సామర్థ్యం, క్యాంటీన్, టికెట్ల ధరల పట్టికలు తదితర వాటిని పరిశీలించారు. నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందిస్తామన్నారు. ఆయన వెంట విఆర్ఒ సుభాషిని, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

డ్రెయినేజీ పూడికతీత పనుల పరిశీలన

ప్రజాశక్తి - నరసాపురం

పట్టణంలోని 20, 21వ వార్డుల్లో చేపడుతున్న డ్రెయినేజీ పూడికతీత పనులను మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మురుగు సమస్యలు లేకుండా చేయడానికి డ్రెయినేజీ పూడిక తీత పనులు చేపట్టామన్నారు. మురుగు నీరు లేకుండా చేయడం వల్ల దోమల సమస్య రాదని, తద్వారా ప్రజలు అంటు రోగాల బారిన పడకుండా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ పాత్రుడు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ డీలర్లు మెరుగైన సేవలందించాలి

ప్రజాశక్తి - ఆచంట

రేషన్ డీలర్లు లబ్ధిదారులకు మెరుగైన సేవలందించి ప్రభుత్వానికి మంచిపేరు తేవాలని డిప్యూటీ తహశీల్దార్ ఎం.సోమేశ్వరరావు అన్నారు. బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో రేషన్‌షాప్ డీలర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీలర్లు సమయపాలన పాటించి స్టాక్ బోర్డులు ఏర్పాటు చేయాలని, సకాలంలో రేషన్ పంపిణీ చేయాలని ఆదేశించారు. జూన్ 1వ తేదీ నుంచి రేషన్ షాపుల్లో బియ్యం, పంచదార ఇతర రేషన్ సరుకులను పంపిణీ చేసేందుకు పౌర సరఫరాల శాఖ ఏర్పాటు చేసిందన్నారు. మండల కేంద్రం నుంచి స్టాకును రేషన్ షాపులకు తరలించామన్నారు. 65 ఏళ్ల పైబడిన వృద్ధులు, వికలాంగులకు రేషన్ డీలర్లు ఇంటికి తీసుకొచ్చి సరుకులు సరఫరా చేస్తారని ఆయన తెలిపారు.

అన్నదాన భవన నిర్మాణానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - కాళ్ల

కాళ్లకూరులో వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో అన్నదాన భవన నిర్మాణానికి పలువురు దాతలు 1,75,000 ఆర్థిక సాయాన్ని బుధవారం అందజేశారు. భీమవరానికి చెందిన డాక్టర్ రాయసం నరేష్, సుధ దంపతులు, వారి కుమారులు సంజయ్, రుద్రాన్ష్ రూ.లక్షా 25 వేల ఆర్థిక సాయాన్ని ఆలయ ఇఒ అరుణ్ కుమార్‌కు అందించారు. హైదరాబాద్ కురుద్రరాజు నిరంజన్ బాలాజీ వర్మ, రమాదేవి దంపతులు రూ.50 వేల సొమ్మును ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం.అరుణ్‌కుమార్‌కు అందజేశారు. దాతలను స్వామివారి శేష వస్త్రంతో సత్కరించి అభినందించారు.

రుతుక్రమంపై అవగాహనుండాలి

ప్రజాశక్తి - గణపవరం

ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

రుతు క్రమ అంతర్జాతీయ దినోత్సవం సందర్భంగా బుధవారం గణపవరం పిహెచ్‌సి ఆధ్వర్యంలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఓంకార్ నాధ్ మాట్లాడుతూ పది సంవత్సరాల నుంచి 19 సంవత్సరాలు వయస్సు గల ఆడపిల్లలు రుతుక్రమంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. రుతుక్రమం అవగాహన కోసం స్థానిక హైస్కూల్లోని ఆడపిల్లలకు వైద్య సిబ్బంది అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. రక్తహీనత ఉంటే ప్రతినెలా రుతుక్రమం సక్రమంగా రాదని, అందువల్ల ఇబ్బంది ఉన్న ఆడపిల్లలు ఐరన్ మాత్రలు వాడితే ఇబ్బంది ఉండదని చెప్పారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ అధికారి జాలాది విల్సన్‌బాబు, హెచ్‌వివి.పద్మజ, స్టాఫ్ నర్స్ కె.సుహాసిని, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

అంతర్జాతీయ రుతుక్రమం దినోత్సవం సందర్భంగా బుధవారం పిప్పర పిహెచ్‌సి వైద్య సిబ్బంది మహిళలకు, 10 నుంచి 14 ఏళ్ల బాలికలకు రుతుక్రమంపై అవగాహన కల్పించారు. డాక్టర్ దివ్యశ్రీ మాట్లాడుతూ 10 నుండి 14 ఏళ్ల బాలికలకు రుతుక్రమంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఆరోగ్య విస్తరణాధికారి వెంకటేశ్వర్లు, పిహెచ్ ఎన్.అన్నాకుమారి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బెల్ట్‌షాపు నిర్వాహకురాలు అరెస్టు

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో బుధవారం నిర్వహించిన దాడుల్లో దగ్గులూరులో బెల్టుషాపు నిర్వహిస్తున్న మహిళను అరెస్టు చేసి ఆమె వద్ద నుండి 6 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో ఎస్ఐలు పి.మహేష్, జి.రఘు, సిబ్బంది పాల్గొన్నారు. బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని పాలకొల్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ మద్దాల శ్రీనివాస్ హెచ్చరించారు.

బాధిత కుటుంబానికి హెల్పింగ్ హ్యాండ్స్ చేయూత

ప్రజాశక్తి - ఉండి

పొట్టకూటి కోసం చేపలు పట్టుకోవడానికి వెళ్లి విద్యుత్ ప్రమాదానికి గురై చనిపోయిన బొజ్జ రవి కుటుంబానికి హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు చేయూతనిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉండి గ్రామం యానాదుల కాలనీకి చెందిన బొజ్జా రవి వెలివర్రు గ్రామంలోని పంట బోదెలో చేపలు పడుతుండగా విద్యుత్ వైరు కాలిగి తగిలి మృతి చెందిన విషయం విదితమే. అతని కుటుంబం ఇబ్బందుల్లో ఉండడంతో వారికి తమ వంతు సహకారంగా నెలకు సరిపడా నిత్యవసర సరుకులు, 25 కేజీల బియ్యం, వెయ్యి రూపాయల నగదు అందజేసినట్లు సభ్యులు తెలిపారు. ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడంలో హెల్పింగ్ హ్యాండ్స్ ఎప్పుడూ ముందుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో హెల్పింగ్ హాండ్స్ సభ్యులు కడగల యువ సాయిరాం, 10 టీవీ రిపోర్టర్ శేషపు మణికంఠ, అర్షద్ అహ్మద్, నెల్లి ప్రదీప్, మద్ది బాల సాయి, ఆర్య, చెన్న హేమంత్, మణికంఠ, పాంౘ్రంకి శివ పాల్గొన్నారు.

బాలికల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ

ప్రజాశక్తి - నరసాపురం

బాలల సంరక్షణలో మహిళా సంరక్షణ కార్యదర్శులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని జిల్లా బాలల అధికారి ఆర్.రాజేష్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన 'కిశోరి వికాసం' అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 18 ఏళ్లు దాటిన బాలికల సంరక్షణపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందన్నారు. బాల్య వివాహాలపై అవగాహన కల్పించాలని, అటువంటి వివాహాలు జరిగితే వెంటనే అధికారుల దృష్టికి తేవాలని తెలిపారు. బాల్య వివాహాలు చేస్తే చట్ట ప్రకారం చర్యలు ఉంటాయని తెలిపారు. ఇందుకు గాను గ్రామ స్థాయి సంరక్షణ ఏర్పాటు చేసి అవగాహన కల్పించాలన్నారు. మొగల్తూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు పిఒ బి.ఊర్మిళ మాట్లాడారు. బాలల హక్కులకు విఘాతం కలగకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. సమావేశంలో ఐసిడిఎస్ పర్యవేక్షకులు, గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శులు (జిఎంఎస్‌కె) పాల్గొన్నారు.


విద్యుత్ వైర్లకు అల్లుకున్న పచ్చని తీగలు

అల్లుకున్న నిర్లక్ష్యం..!

విద్యుత్ స్తంభానికి అల్లేసిన తీగలు - పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - నరసాపురం

పట్టణంలోని 17 వార్డు మూడు బొమ్మల సెంటర్ సమీపంలోని ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ వద్ద ఉన్న విద్యుత్ స్తంభం, వైర్లకు పిచ్చి పాదులు అల్లుకుని ప్రమాదకరంగా మారాయి. వర్షం కురిసే సమయంలో, ఈదురుగాలులు వీచే సమయంలో ఇవి ప్రమాద తీవ్రతను పెంచి విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతోంది. అయినప్పటికీ విద్యుత్ శాఖాధికారులు నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు నిర్లక్ష్యాన్ని వీడి ప్రమాదాలు జరగకుండా ముందస్తుగా చర్యలు తీసుకుని వైర్లకు అల్లుకున్న తీగలను తొలగించాలని పలువురు కోరుతున్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

చిరస్మరణీయులు ఎన్‌టిఆర్

జయంతి వేడుకల్లో నేతలు


పెదఅమిరంలో ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నేతలు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

పేద ప్రజలకు కిలో బియ్యం రెండు రూపాయలకే అందజేసి, పేద ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన మహనీయుడు ఎన్‌టిఆర్ అని ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఎన్‌టిఆర్ జయంతిని పురస్కరించుకొని ఆయనకు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ టిడిపిని స్థాపించిన తొమ్మిది నెలలకే అధికారంలోకి తెచ్చిన ఘనత రామారావుకే దక్కుతుందన్నారు. అలాగే టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి, భవన నిర్మాణ, ఇతర నిర్మాణాల బోర్డు ఛైర్మన్ వలవల మల్లికార్జునరావు (బాబ్జి) ఆదేశాల మేరకు పట్టణ అధ్యక్షులు పట్నాల రాంపండు ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ జయంతిని నిర్వహించారు. తహశీల్దార్ కార్యాలయం వద్ద తహశీల్దార్ ఎం.సునీల్ కుమార్, విఆర్ఒలు, సిబ్బంది నివాళులర్పించారు.

వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా బుధవారం రిసోర్స్ పర్సన్ కొప్పెల్ల శ్రీనివాసరావు ఎన్‌టిఆర్ జయంతిని పురస్కరించుకొని దుర్యోధనుని ఏకపాత్రాభినయం వేసి విద్యార్థులను, పాఠకులను అలరించారు గరికపాటి బాపయ్య శర్మ మాట్లాడుతూ ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయుడు నందమూరి తారక రామారావు అని పేర్కొన్నారు. వేసవి శిక్షణ తరగతులలో విద్యార్థులకు డ్రాయింగ్, పెయింటింగ్, పేపర్ క్రాఫ్ట్, చెస్, క్యారమ్స్, క్విజ్, స్పోకెన్ ఇంగ్లీష్ విద్యార్థులకు నేర్పించారు. శిక్షణ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయాధికారి వి.శ్రీనివాసరావు కోరారు.

పెనుమంట్ర : నిరుపేదలకు, బడుగు, బలహీన వర్గాలకు టిడిపి ద్వారా వెలుగులు నింపిన ఆదర్శ నేత, తెలుగు వెలుగు ఎన్‌టిఆర్ అని, ఆయన ఆశయాలు అందరికీ ఆదర్శమని టిడిపి నెగ్గిపూడి అధ్యక్షులు చిర్ల బాలాజీ రెడ్డి అన్నారు. నెగ్గిపూడిలో ఎన్‌టిఆర్ జయంతి సందర్భంగా టిడిపి జెండాను ఆవిష్కరించి ఎన్‌టిఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. టిడిపి కార్యదర్శి కట్టా వెంకటరమణ, మాజీ వైస్ ఎంపిపి కట్టా బాలాజీ, వనకుమార్, వెలగల మల్లికార్జున రెడ్డి, కడలి వెంకటేశ్వర రావు, సుబ్రహ్మణ్యం, తోలేటి రాంబాబు, పాలా ప్రసాద్, కీర్తి చైతన్య పాల్గొన్నారు. అలాగే మార్టేరు, వెలగలేరు, సత్యవరం, ఆలమూరు, నెలమూరు, పొలమూరు, పెనుమంట్ర, కొయ్యేటిపాడు, జుత్తిగ, నత్తారామేశ్వరం, సోమరాజు ఇల్లింద్రపర్రు, గరువు, వెలగలవారి పాలెం, ఓడూరు, భట్లమగుటూరులో జయంతిని నిర్వహించారు.

గణపవరం : ఎన్‌టిఆర్ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని టిడిపి మండల అధ్యక్షులు ఇందుకూరి రామకృష్ణంరాజు తెలిపారు. స్థానిక కుమారి థియేటర్ వద్ద ఉన్న ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నేతలు నివాళులర్పించారు. గణపవరం అధ్యక్షులు కూసంపూడి సురేందర్‌కుమార్ రాజు, ఉంగుటూరు మార్కెట్ యార్డు వైస్ ఛైర్మన్ కూనసాని నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కాళ్ల : రాజకీయాల్లో తనదైన ముద్ర వేసిన వ్యక్తి నందమూరి తారక రామారావు అని కోపల్లె సొసైటీ మాజీ ఛైర్మన్ నంద్యాల రామరాజు (హాట్ లైన్స్ బాబు) అన్నారు. పెదఅమిరంలో ఎన్‌టిఆర్ జయంతిని నిర్వహించారు. ముందుగా ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ఎంపిపి ఆరేటి వెంకట రత్నప్రసాద్, కఠారి నరసింహరాజు, మాజీ సర్పంచులు కట్రెడ్డి శ్రీనివాసరావు, మంతెన ఆంజనేయరాజు, మంతెన కోదండ రామరాజు పాల్గొన్నారు. కాళ్లలో గ్రామ అధ్యక్షులు పెంటపాటి వెంకట నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. కేక్ కట్‌చేసి పేదలకు పండ్లు పంపిణీ చేశారు. టిడిపి మండల అధ్యక్షులు జివి.నాగేశ్వరావు, గ్రామ అధ్యక్షులు పి.వెంకట నాగేశ్వరరావు, నీటి సంఘం అధ్యక్షులు ఎం.మాధవరావు పాల్గొన్నారు.

పాలకోడేరు : మండలంలో ఎన్‌టిఆర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. గొరగనమూడిలో సర్పంచి గొట్టుముక్కల వెంకట సత్యనారాయణరాజు (శివాజీరాజు) ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం 150 మందికి దుప్పట్లు పంపిణీ చేశారు. గొల్లలకోడేరులో నియోజకవర్గ బిసి నేత కామన రాంబాబు, గ్రామ అధ్యక్షులు కమ్మిలి రాంబాబు కేక్ కట్ చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ వి.రెడ్డియ్య, పిఏపిఆర్‌డి.రాంప్రసాద్, ఎఒ శ్రీనివాసరాజు, సీనియర్ అసిస్టెంట్ నాగేశ్వరరావు ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాల వేశారు. పాలకోడేరు పంచాయతీ కార్యాలయంలో సర్పంచి ఇంజేటి మరియమ్మ లక్ష్మీపతి, కార్యదర్శి బంగారు గోపి నివాళులర్పించారు. టిడిపి మండల ఉపాధ్యక్షులు ఈల్లా చిన్న సత్యనారాయణ, బిసిసెల్ మండల ఉపాధ్యక్షులు దేన బోయిన వెంకటేశ్వర్లు, ఎస్‌సి సెల్ ప్రధాన కార్యదర్శి గోడి పెద్దిరాజు పాల్గొన్నారు.

వీరవాసరం : వీరవాసరం తూర్పు చెరువు సెంటర్ వద్ద ఎన్‌టిఆర్ విగ్రహానికి పార్టీ మండల అధ్యక్షుడు కొల్లేపర శ్రీనివాసరావు, ఎంపిపి వీరవల్లి దుర్గాభవాని చంద్రశేఖర్ ఎన్‌టిఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. టిడిపి మత్స్యపురి గ్రామ అధ్యక్షుడు చింతా కనకయ్య ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ జయంతి వేడుకలు నిర్వహించారు. వీరవాసరం మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపిడిఒ కిరణ్ కుమార్, పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షురాలు లక్ష్మీ ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ జయంతి వేడుకలు నిర్వహించారు. రాయపల్లి వెంకట్, ఆదిరెడ్డి గంగారావు, ఎల్.సత్యనారాయణ, శ్రీమన్నారాయణ, జి.చిన్నారావు పాల్గొన్నారు.

ఆచంట : మండలంలోని ఆచంట, కొడమంచిలి, పెదమల్లం, కోడేరు, కరుగోరుమిల్లి, భీమలాపురం, వల్లూరు, పెనుమంచిలి, ఆచంట వేమవరం, శేషమ్మ చెరువు, అయోధ్యలంక గ్రామాల్లో టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఎన్‌టిఆర్ జయంతి సందర్భంగా కేక్‌కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. టిడిపి నాయకులు గొడవర్తి శ్రీరాములు, తమ్మినీడి ప్రసాద్, నెక్కంటి ప్రభాకర్‌రావు, చిలుకూరి సీతారాం, మురళి, సత్యనారాయణ పాల్గొన్నారు.

గణపవరం : తెలుగు వారి ఆత్మగౌరవం కాపాడిన ఎన్‌టిఆర్ రాష్ట్ర ప్రజల హృదయాల్లో సిరస్థాయిగా నిలిచి ఉంటారనిడిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ పి.నిర్మలాకుమారి అన్నారు. ఎన్‌టిఆర్ జయంతి సభలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. వైస్ ప్రిన్సిపల్ కె.స్వరూపరాణి, జివి.రమణ పాల్గొన్నారు. జయంతి సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

నరసాపురం: స్థానిక ప్రథమ శ్రేణి శాఖ గ్రంథాలయం వద్ద నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన తరగతులు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఎన్‌టిఆర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తెలుగు మహిళా అధ్యక్షురాలు రాజలక్ష్మి ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజ్యలక్ష్మి మాట్లాడారు. అనంతరం పిల్లలకు యోగా, జికె క్లాస్, డాన్స్ క్లాసులు, పుస్తక పఠనం చేయించారు. కార్యక్రమాలన్నీ గ్రేడ్ వన్ లైబ్రేరియన్ కెజెఎస్ఎల్.కుమారి పర్యవేక్షించారు.

ఆకివీడులో..

ఆకివీడు : తెలుగువారి కీర్తిని దశ దిశలా వ్యాపింపజేసిన వ్యక్తి నందమూరి తారక రామారావు అని పార్టీ మండల అధ్యక్షులు ప్రసాద్ కొనియాడారు. టిడిపి ఆధ్వర్యంలో స్థానిక శ్రీనగర్, శాలిపేట, వేలంపేటరామాలయం, అయిభీమవరం రోడ్డు, డైలీ మార్కెట్, సంత మార్కెట్ల వద్ద ఉన్న ఎన్‌టిఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సాలిపేట వద్ద పేదలకు దుప్పట్లు, దుస్తులు, పండ్లు పంపిణీ చేశారు. నాయకులు, ఎఎంసి ఛైర్మన్ బొల్లా వెంకట్రావు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

పాలకొల్లు : మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశాలతో పాలకొల్లులో ఎన్‌టి రామారావు జయంతిని ఘనంగా నిర్వహించారు. గాంధీ బొమ్మల సెంటర్లో రామారావు కాంస్య విగ్రహానికి కూటమి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు అందజేశారు. అలాగే స్థానిక ఎఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌టిఆర్ జయంతిని కళాశాల ప్రిన్సిపల్ టి.రాజరాజేశ్వరి అధ్యక్షతన నిర్వహించారు. ప్రిన్సిపల్ నివాళులర్పించి మాట్లాడారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు ఎం.రామ కృష్ణ, విడివి.విజయలక్ష్మి, కళాశాల సూపరింటెండెంట్ బి.కనకలక్ష్మి, వి.శిరీష, పి.దుర్గేశ్వరి పాల్గొన్నారు.

తణుకు : ఎన్‌టిఆర్ జయంతి సందర్భంగా తణుకు పట్టణంతో పాటు తణుకు, ఇరగవరం, అత్తిలి మండలాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు ఎన్‌టిఆర్ అభిమానులు, టిడిపి నేతలు పాల్గొని సంబరాలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఎన్‌టిఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో తణుకు మున్సిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్ ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తణుకు పురుషుల శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ అధ్యక్షులు వావిలాల సరళాదేవి ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ జయంతి వేడుకలను నిర్వహించారు. అత్తిలి మండలం మంచిలిలో శిరగాని నాగేశ్వరరావు (భగవాన్ నాగు) ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు చేశారు. 22వ వార్డులో పేదలకు మామిడి పండ్లు పంపిణీ చేశారు. టిడిపి నేతలు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెంలో..

నవరస నటనాధినేత నందమూరి తారక రామారావు అని సాహితీ సామ్రాజ్యం అధ్యక్షులు తాడినాడ భాస్కరరావు అన్నారు. సాహితీ సామ్రాజ్యం ఆధ్వర్యంలో స్థానిక మాంటిస్సోరీ స్కూల్ ప్రాంగణంలో ఎన్‌టిఆర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌టిఆర్, ఘంటశాల పాడిన పాటలపై పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. అనంతరం స్కూల్ ఉపాధ్యాయురాలు పైబోయిన నాగవెంకటలక్ష్మిని నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. స్కూల్ డైరెక్టర్ అనపర్తి ప్రకాశరావు, ప్రధానోపాధ్యాయిని మలకపల్లి లక్ష్మీ, భవాని, కొల్లు పావని పాల్గొన్నారు.

ఉండి : ఎన్‌టిఆర్ కారణజన్ముడు అని డిసి వైస్ ఛైర్మన్ మంతెన సాయి లచ్చిరాజు అన్నారు. మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో, టిడిపి కార్యాలయంలో, ప్రభుత్వ కార్యాలయాల్లో ఎన్‌టిఆర్ జయంతిని నిర్వహించారు. మంతెన సాయి లచ్చిరాజు మాట్లాడారు. అనంతరం కేక్‌కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెనుమంట్ర : మార్టేరు శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా 30వ రోజు వివిధ కార్యక్రమాలు జరిగాయి. ముందుగా ఎన్‌టిఆర్ జయంతిని పిల్లలు ఘనంగా చేశారు. గ్రంథాలయంలో పిల్లలకు మ్యూజికల్ ఛైర్స్ పోటీలు నిర్వహించి, లైబ్రరీ అధికారి శివకుమార్ బహుమతులు అందించారు. శిబిరంలో ఎస్.ఆదిత్య, బి.దుర్గ, వి.అన్విక, పి.చైతన్య, కె.యాదగిరి పాల్గొన్నారు.

భీమవరం టౌన్ : ఎన్‌టిఆర్ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచి ఉన్నారని ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరం వీరమ్మ పార్క్ వద్ద టిడిపి సీనియర్ నాయకులు మద్దుల రాము ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ జయంతి సందర్భంగా 150 మంది పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ముందుగా ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. తెలుగు జాతి గర్వించదగ్గ మహనీయుడు ఎన్‌టిఆర్ అన్నారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

మొగల్తూరు : తెలుగు భాష గౌరవాన్ని అంతటా చాటిన యుగపురుషుడు తారక రామారావు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మొగల్తూరులోని పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శి ముచ్చర్ల నాగేశ్వరరావు, మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపిడిఒ సిహెచ్ త్రిశూలపాణి ఆయా కార్యాలయాల సిబ్బంది ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూల మాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉమ్మడి తెలుగు రాష్ట్ర కీర్తి ప్రతిష్టలు ప్రపంచ స్థాయిలో చాటి చెప్పి, పేదరిక నిర్మూలనకు, రాష్ట్ర అభివృద్ధికి ఎన్‌టిఆర్ చేసిన కృషిని కొనియాడారు.

పాఠ్య పుస్తకాలను పరిశీలిస్తున్న ఎంఇఒ జాన్ ప్రభాకర్

పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు

నరసాపురం ఎంఇఒ - 2 జాన్ ప్రభాకర్

ప్రజాశక్తి - నరసాపురం

ప్రభుత్వ పాఠశాలలకు ముందుగానే ప్రభుత్వం పాఠ్య పుస్తకాలను సరఫరా చేసింది. వచ్చిన పుస్తకాలను బుధవారం నరసాపురం ఎంఇఒ-2 జాన్ ప్రభాకర్ పరిశీలించారు. పట్టణంలోని మిషన్ హైస్కూల్లో పుస్తకాలను భద్రపర్చారు. పట్టణ, మండలంలో మొత్తం తొలివిడతలో 31 వేల పుస్తకాలు అందుబాటులోకి వచ్చాయి. రెండో విడతగా 14 వేలు పుస్తకాలు వచ్చాయని ఎంఇఒ తెలిపారు. ప్రస్తుతం ఉన్న పాఠ్య పుస్తకాలను తరగతుల వారీగా విభజించి త్వరలో స్కూల్ హెచ్‌ఎంలకు సరఫరా చేయనున్నట్లు ఆయన తెలిపారు. పాఠశాలలు తెరిచిన తొలి రోజే వీటిని విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేస్తామన్నారు. ఎటువంటి గందరగోళం లేకుండా ముందుగానే పాఠ్యపుస్తకాలు మండలాలకు చేరినట్లు వెల్లడించారు. మిగిలిన పుస్తకాలు త్వరలో వస్తాయన్నారు. ఎంఇఒ వెంట సిఆర్‌పిలు శ్రీను, తాతయ్య, మణి, నేతాజీ, శ్రీనివాస్, ఆనంద్, రవీంద్ర పాల్గొన్నారు.

యోగా జీవనశైలిలో భాగం కావాలి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

యోగాంధ్రాలో భాగంగా బుధవారం టౌన్ సిఐ బోనం ఆది ప్రసాద్, రూరల్ సిఐ ఎ.రమేష్, పట్టణ ఎస్ఐలు బాదం శ్రీనివాసు, నాగరాజు, రూరల్ ఎస్ఐ ప్రసాద్, సిబ్బంది, మహిళా పోలీసులతో సత్యవతి నగర్‌రోడ్డులోని విశ్వ విజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠం వద్ద ఆరా ఫౌండేషన్ ఆధ్వర్యంలో యోగా సాధన నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు మాట్లాడుతూ యోగా ప్రజల జీవన జీవనశైలిలో భాగం కావాలన్నారు. జూన్ 21న జరిగే 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని రాష్ట్రంలో ఘనంగా జరిపేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోందన్నారు. యోగా మాస్టారు కరిబండి రామకృష్ణ మాట్లాడారు. నిట్ ఇన్‌ఛార్జి డైరెక్టర్ ఎన్‌వి.రమణారావు ఆధ్వర్యంలో రిజిస్ట్రార్ పి.దినేష్ శంకర్‌రెడ్డి పర్యవేక్షణలో జూన్ 21న నిర్వహించనున్న యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిట్ ప్రాంగణంలో యోగా వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథి హిమబిందు, అసోసియేట్ డీన్ రాజేశ్వరరెడ్డి మాట్లాడారు. అనంతరం ఉద్యోగులు, విద్యార్థులు యోగాసనాలు వేశారు. ఆచార్యులు తలారి రేష్మా, శ్రీకాంత్, రాజేష్, మూర్తి పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు : ఆర్‌డిఒ

ప్రజాశక్తి - నరసాపురం

మాట్లాడుతున్న ఆర్‌డిఒ దాసిరాజు

లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం నేరమని, అలా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్‌డిఒ దాసిరాజు హెచ్చరించారు. బుధవారం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఆర్‌డిఒ దాసిరాజు అధ్యక్షతన సబ్ డిస్ట్రిక్ లెవెల్ మల్టీ మెంబర్ అథారిటీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. స్కానింగ్ సెంటర్లపై నిరంతరం నిఘా ఉంటుందన్నారు. వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది డివిజన్‌లోని స్కానింగ్ సెంటర్లలో దశల వారీగా తనిఖీలు నిర్వహించాలని తెలిపారు. స్కానింగ్ సెంటర్లు లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారని ఫిర్యాదులు వస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. లింగ నిర్ధారణ పరీక్షలకు పాల్పడిన వైద్యులకు చట్టప్రకారం మొదటి తప్పునకు మూడేళ్ల జైలు శిక్ష, రూ.50,000 జరిమానాతో పాటు భారత వైద్య మండలి వద్ద వైద్యుల ధ్రువీకరణ పత్రం ఐదేళ్ల వరకూ తొలగించబడుతుందన్నారు. ఇలా ఒకసారి కాకుండా మరలా లింగ నిర్ధారణ పరీక్షలు పాల్పడితే ఐదేళ్ల జైలుశిక్ష, రూ. లక్ష జరిమానా, భారత్ వైద్య మండలిలో శాశ్వతంగా వైద్య ధ్రువీకరణ పత్రం తొలగిస్తామని హెచ్చరించారు. తణుకు న్యూ రిజిస్ట్రేషన్, మోడిఫికేషన్ స్కాన్ సెంటర్లు ఆమోదం తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఒ వి.ప్రసాద్, కన్వీనర్ వి.ప్రసాద్, ఎస్ఐ సిహెచ్ జయలక్ష్మి, లీగల్ ఎక్స్‌పెర్ట్ చల్లా దానయ్య, చిన్నపిల్లల వైద్యులు పాల్గొన్నారు.

రోడ్డు అధ్వానం..!

ప్రజలు, వాహనదారుల అవస్థలు

ప్రజాశక్తి - మొగల్తూరు

జగన్నాథపురంలో అధ్వానంగా ఉన్న రోడ్డు

జగన్నాథపురం నుంచి జిల్లా కేంద్రం భీమవరం వెళ్లే రహదారి ధ్వంసమైంది. మండలంలోని పలు గ్రామాల నుంచి భీమవరానికి వెళ్లే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దారి తిప్పలోని 216 జాతీయ రహదారి అనుసంధాన మార్గం, మచ్చగడ, దెయ్యాల తిప్ప తదితర ప్రాంతాలలో రహదారి ధ్వంసమైంది. దీంతో ప్రజలు, వాహనదారులు జిల్లా కేంద్రానికి వెళ్లేందుకు తీవ్ర సౌకర్యానికి గురవుతున్నారు. అధికారులు స్పందించి రహదారి మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

నేడు, రేపు రైతులకు అవగాహనా సదస్సులు

ప్రజాశక్తి - పెనుమంట్ర

మండలంలో వికసిత్ కృషి సంకల్ప అభయాన్ పథకం కింద రెండు గ్రామాల్లో 29, 30వ తేదీల్లో రైతులకు అవగాహనా సదస్సులు నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి అడబాల జ్యోషిలా ఇక్కడ తెలిపారు. కార్యక్రమంలో భాగంగా 29వ తేదీ గురువారం మధ్యాహ్నం రెండు గంటలకు ఆలమూరులో, 30వ తేదీ శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు మల్లిపూడిలో నిర్వహిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. మార్టేరు ప్రాంతీయ వ్యవసాయపరిశోధనా స్థానం, కిసాన్ విజ్ఞాన కేంద్రం నుంచి వ్యవసాయ శాస్త్రవేత్తలతో రైతులకు అవగాహన సదస్సులు జరుగుతాయని తెలిపారు. రైతులు పాల్గొని సేవలు పొందాలని ఆమె కోరారు.

మహానాడుకు తరలిన టిడిపి నేతలు

ప్రజాశక్తి - ఉండి

కడపలో జరిగే మహానాడుకు టిడిపి మండల అధ్యక్షులు కరిమెరక నాగరాజు ఆధ్వర్యంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు ఉండి కలిదిండి అబ్బాయిరాజు జన్మభూమి పార్కు నుంచి తరలి వెళ్లారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ పార్టీ పెట్టి 9 నెలల కాలంలోనే అధికారం చేపట్టిన ఘనత టిడిపిది అన్నారు. రాష్ట్ర అభివృద్ధి టిడిపితోనే సాధ్యమన్నారు. ఇప్పటికే పలువురు నాయకులు కడప వెళ్లారని తెలిపారు.

NAME CHANGE

I, **PARUVU SUREKHA** W/o Paruvu Hari Babu (late), Resident of D.No.9-1-44, Churchpeta, Narasapuram-534275, W.G.Dt. A.P. I have been changed my Minor Son's name from **PARUVU SAJEEV** (Old name) to **PARUVU SAJEEV AARON** (New name). Hence after all my minor son's Documents and correspondence will be continue with his new name **PARUVU SAJEEV AARON**

దస్తావేజులు పోయినవి

పశ్చిమ గోదావరి జిల్లా, ప్రస్తుతం ఏలూరు జిల్లా, ఏలూరు జిల్లా, ఏలూరు నగరం, రామకృష్ణాపురం ఓవర్ బ్రిడ్జి దగ్గర, డోర్‌నెం.22డి-8-15రు కాపురస్తులు మాగంటి రాజశేఖర్, మాగంటి వీరాస్వామి అను నాయొక్క ఒరిజినల్ లింక్ దస్తావేజులు పడిపోయినవి. ఏలూరు ఆర్.సిలో 1వ పుస్తకం దస్తావేజు నెం.954/2023 రిజిస్టరు చేయించుకొనియున్నాను. సదరు దస్తావేజునెం. 954/2023 రునకు లింకు దస్తావేజులు 332/1995 మరియు 333/1995 గల ఒరిజినల్స్‌ను నాకు ఇచ్చి యున్నారు. అయితే నేను ప్రయాణంలో ఉండగా సదరు లింకు దస్తావేజు ఏలూరు, కొత్త బస్టాండ్ పరిధిలో పడి పోయినవి. ఎంత వెతికినా దొరకలేదు. ఎవరికైన దొరికినచో ఈ క్రింది అడ్రస్సుకు తెలియజేయగలరని కోరుచున్నాను.

మాగంటి రాజశేఖర్, S/o.వీరాస్వామి,
డోర్‌నెం.22డి-8-15, రామకృష్ణాపురం, ఏలూరు,
ఏలూరు జిల్లా. సెల్: 7989182322

పనిచేయని మున్సిపల్ అధికారుల ఫోన్లు

బిల్లులు చెల్లించని వైనం.. ప్రజల అవస్థలు

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం మున్సిపాల్టీలో 15 రోజులుగా మున్సిపల్ అధికారుల ఫోన్లు పనిచేయడం లేదు. దీంతో అత్యవసర పరిస్థితి, సాధారణ ఫిర్యాదులు చేయాలన్నా సెల్ ఫోన్లు పనిచేయక పోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ అధికారులకు నిత్యం పురపాలక ప్రజలు ఫోన్లు చేస్తూ ఉంటారు. పర్సనల్ నెంబర్లకు చేయలేని సామాన్యులు డిపార్ట్మెంట్ సిమ్స్ పని చేయకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మొత్తం 19 ఎయిర్టెల్ నెట్ వర్క్‌కు చెందిన సిమ్స్ మున్సిపాల్టీలోని అధికారులకు అందజేశారు. వీటిలో కమిషనర్ సిమ్ మినహా మిగిలిన 18 సిమ్‌లు పని చేయడం లేదు. మున్సిపల్ డిఇ, ముగ్గురు ఎఇలు, ఆర్ఐ, టిపిఎస్ మిగిలిన సిబ్బంది ఈ సిమ్‌లు ఉపయోగిస్తున్నారు. గతేడాది ఆగస్టు నుండి ఏప్రిల్ వరకూ నెట్ వర్క్ బిల్లు తొమ్మిది నెలల నుండి సుమారు రూ.లక్ష చెల్లించాల్సి ఉందని మున్సిపల్ అధికారులు చెబుతున్నారు. సిఎంఎఫ్‌ఎస్‌లో బిల్లులు జమ కాకపోవడంతో ఈ సమస్య వచ్చిందని మున్సిపల్ అధికారులు తెలుపుతున్నారు. దీనిపై కమిషనర్ ఎం.అంజయ్యను వివరణ కోరగా బిల్లులు చెల్లించామని రెండు రోజుల్లో సిమ్‌లు పనిచేసేలా చూస్తామన్నారు.